మిచాంగ్..హై అలెర్ట్..

- సముద్రంలో భారీగా ఎగసిపడుతున్న అలలు
- అధికారుల పర్యటన
- ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ఉలవపాడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో హై అలెర్ట్ ప్రకటించారు. ఆదివారం ఉదయం నుండే వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి వర్షం కురుస్తుంది. ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. సముద్రంలో అలల తాకిడి అధికంగా ఉండడంతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రధానంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాలపై ప్రభావం అధికంగా ఉంటుందన్న సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లడం, పారిశుధ్య కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. తీరప్రాంత గ్రామాలైన కరేడు, అలగాయపాలెం, చాకిచర్ల, పెదపట్టుపాలెం, రామాయపట్నం గ్రామాల్లో ప్రజలకు అప్రమత్తం చేశారు. మండల పరిధిలో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఉలవపాడులోని కోటిరెడ్డి గుంట ప్రజలను ఎంపీడీఓ కార్యాలయంలో, తిరుపతిగుంట ప్రజలను తుఫాన్ షెల్టర్‌లో, వెంగారెడ్డిగుంట కాలనీ వాసులను జనరల్ స్కూల్‌లో పునరావాసం ఏర్పాటుచేసి భోజన ఏర్పాట్లు చేశారు.


రామాయపట్నం పోర్టు వద్ద సముద్రంలో నిలిచిన చెన్నై బోట్లు

సబ్‌కలెక్టర్ పరిశీలన..

మండల పరిధిలో లోతట్టు ప్రాంతాలను కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక ఆదివారం పరిశీలించారు. ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాల్లోనే ఉంచాలని తహశీల్దార్ బ్రహ్మయ్య కు తెలిపారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. ఉలవపాడు, రామాయపట్నం, కరేడు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

గుడ్లూరు: మిచాంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక అన్నారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన కర్లపాలెం, సాలిపేట, మూర్తింపేట గ్రామాల్లో సబ్ కలెక్టర్ ఆదివారం పర్యటించారు. రానున్న మూడు రోజులు పాటు భారీవర్షాలు పడుతాయని వాతావరణశాఖ చెబుతున్నందున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మొండివారిపాలెం వద్ద నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టును పరిశీలించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేసి అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ ప్రభావంతో చెన్నైకు చెందిన మత్స్యకారులు తమ బోట్లును రామాయపట్నం పోర్టు వద్దకు చేరుకొని సముద్రంలో నిలుపుకోవడంతో సబ్‌కలెక్టర్ బోట్లలో ఉన్న మత్స్యకారులతో మాట్లాడారు. బయటకు వచ్చితుఫాన్ షెల్టరులో ఉండాలని వారికి సూచించారు.

వారిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని తహసీల్దార్‌కు సూచించారు. చెన్నై మత్స్యకారులకు చెందిన సుమారు 20 బోట్లు రామాయపట్నం పోర్టు వద్దకు వచ్చి రెండు బ్రేక్‌వాటర్‌ల మధ్య సముద్రంలో నిలుపుకున్నారు.


వలలు ఒడ్డుకు చేర్చుకుంటున్న మత్స్యకారులు


తిరుపతిగుంటకాలనీ వాసులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శోభిక


ఒడ్డుకు చేర్చుకున్న బోట్లు

క్లుప్తంగా

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం పోలేరమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. అభిషేకాల అనంతరం పోలేరమ్మను ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు కుంకుమ పూజ, గోత్రనామార్చనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకరు, దేవస్థానం చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విభిన్న ప్రతిభావంతులను కించపరిస్తే చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న కందుకూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిఖిల్‌రెడ్డి

సింగరాయకొండ: విభిన్న ప్రతిభావంతులను కించపరచడం చట్టరీత్యా నేరమని కందుకూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిఖిల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాకల తుఫాన్ షెల్టర్ వద్ద కందుకూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఇవ్వాలని, వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను సక్రమంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల చట్టం 2016 గురించి ప్రజలకు వివరించారు. లాయర్ సన్నెబోయిన శ్రీనివాసులు, సర్పంచ్ సైకం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

టంగుటూరు: కొండపి మండలం పెద్దకర్లగుంట గ్రామానికి చెందిన బల్లిపల్లి మాచర్ల అనే దివ్యాంగుడు నడవలేక ఇబ్బంది పడుతున్నాడని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని కందులూరు గ్రామంలో ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మన్నం వెంకయ్య చేతుల మీదుగా ట్రై సైకిల్ అందించారు. కార్యక్రమంలో కొండపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గర్నిపూడి రమేష్, వికలాంగుల జిల్లా నాయకులు పసుమర్తి రాజేష్, పైనం మధు, పసుమర్తి ఆనందు, మన్నం చిన్న, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో భారీ వర్షం


సహాయక చర్యల పరికరాలతో ఎస్సై ఖాదర్‌బాషా, సిబ్బంది

టంగుటూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఆదివారం టంగుటూరులో భారీ వర్షం కురిసి రహదారులు జలమయమయ్యాయి. పోతల చెంచయ్యకాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందిపడ్డారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ సంజీవరావు తీర ప్రాంత గ్రామాలైన వెలగపూడి, తాళ్లపాలెం, తేటుపురం, పసుకుదురు, అనంతవరం, పుల్లారెడ్డిపాలెం గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టారు. ఎస్సై ఖాదర్‌బాషా తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం అన్ని రకాల పరికరాలు సిద్ధం చేశారు. పంటలు దెబ్బతినకుండా వర్షం నీరు పొలాల్లో నిల్వ ఉండకుండా ఏఓ స్వర్ణలత రైతులకు సలహాలు, సూచనలు చేశారు.

రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి

సింగరాయకొండ: రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని, అవకతవకలు జరిగితే సహించేది లేదని తహసీల్దార్ సీహెచ్ ఉష రేషన్ సరఫరా చేసే వాహనదారులను హెచ్చరించారు. మండలంలోని పాకల పంచాయతీ క్రాంతినగర్‌లో జరుగుతున్న రేషన్ పంపిణీని ఆదివారం ఆమె స్వయంగా పరిశీలించారు. ఎండీయూ సిద్దయ్యకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఉష మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి రేషన్ అందించాలని, ఏదో ఒక సెంటర్లో పెట్టుకుని రేషన్ ఇస్తున్నారని ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ ప్రవీణ్, వీఆర్‌ఓ సీతారామయ్య పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

కనిగిరి రూరల్: మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో విజయం సాధించడంపై ఆ పార్టీ శ్రేణులు కనిగిరిలో సంబరాలు చేశారు. పట్టణంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల శ్రీనివాసులరెడ్డి, తిప్పలూరు శ్రీను, హరికృష్ణా, గంజి మనోజ్, ముక్కు వెంకటరెడ్డి, వీ వెంకటేష్, రాధాకృష్ణమూర్తి, చెన్నా సుబ్రహ్మణ్యం, మధు, రాం ప్రసాద్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

సింగరాయకొండ: అతి తీవ్రమైన మిచాంగ్ తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటామని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. తుఫాన్ సందర్భంగా ఆదివారం పాకల, ఊళ్లపాలెం సముద్రతీర ప్రాంతాలను ఆమె సందర్శించి మత్స్యకారులకు ధైర్యం చెప్పారు. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, మత్స్యకారులు ఎవరూ అవసరమైతే మినహా ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. పాఠశాలలకు ఈ నెల 4, 5 తేదీల్లో ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని తెలిపారు. తుఫాన్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎదుర్కొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని మండలానికి కేటాయించినట్లు ఆమె వివరించారు. తుఫాన్ కారణంగా రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఏ సమస్య వచ్చినా ఈ కేంద్రానికి ఫోన్ చేయాలని సూచించారు. ఈ కేంద్రాన్ని 4వ తేదీ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 9398296657, 9441370252 సెల్ నంబర్ల ద్వారా, 4వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 8 గంటల వరకు 8977171071, 8297419950 సెల్ నంబర్ల ద్వారా, 5వ తేదీ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 8297275528, 9701251008 సెల్ నంబర్ల ద్వారా, 5వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 6వ తేదీ ఉదయం 8 గంటల వరకు 9032145167, 9885704408 సెల్ నంబర్ల ద్వారా ఫోన్ చేయాలని ఆమె వివరించారు. పాకల, ఊళ్లపాలెం తీరంలో పరిస్థితులను రామాయపట్నం మెరైన్ సీఐ ఆర్ఎస్ కిషోర్‌కుమార్ తన సిబ్బందితో పర్యవేక్షించి మత్స్యకారులకు తగిన సూచనలు చేశారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని పాకల పంచాయతీ పల్లెపాలెం, చెల్లెమ్మగారిపట్టుపాలెం, పోతయ్యగారి పట్టుపాలెం, ఊళ్లపాలెం పంచాయతీలోని దేవలం పల్లెపాలెం సముద్ర తీరాల్లో మత్స్యకారులు ట్రాక్టర్ల సహాయంతో బోట్లను తీరానికి దూరంగా జరుపుకుని వలలు కొట్టుకుపోకుండా బోట్లలో ఎక్కించి భద్రపరుచుకున్నారు. సీఐ దాచేపల్లి రంగనాథ్, మండల ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి పాకల, ఊళ్లపాలెం తీరాలను పరిశీలించి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో చర్చించారు.


మత్స్యకారులతో మాట్లాడుతున్న రామాయపట్నం మెరైన్ సీఐ కిషోర్‌కుమార్


ఊళ్లపాలెంలో తీరానికి దూరంగా ఉంచిన బోట్లు, వలలు

నూతన దంపతులకు ఆశీర్వాదం

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, రమణమ్మ దంపతుల కుమారుడు నవీన్ యాదవ్ వివాహం గత నెల 24వ తేదీన బెంగుళూరులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని చెన్నపునాయునిపల్లెలో ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు స్వగృహంలో వివాహ రిసెప్షన్ నిర్వహించారు. నూతన దంపతులు నవీన్‌యాదవ్ తేజస్వినిలను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పెరుగు మురళీకృష్ణ, పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి, భువనగిరి వెంకటయ్య, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, దద్దాల నారాయణ, గుంటక తిరుపతిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బుర్రా

వైభవంగా మహా పుష్పయాగం


విశిష్ట అలంకరణలో నారాయణస్వామి మూల విగ్రహమూర్తి


పుష్పాలతో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు యాగం చేస్తున్న వేద పండితులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మహా పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా నారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి, శ్రీనారాయణస్వామివార్లకు మహా పుష్పయాగం చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశదీపం కార్యక్రమం చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణువు, నారాయణ స్వామివార్ల ఉత్సవమూర్తులను భక్తులు పల్లకిపై ఆలయం వద్ద నుంచి మండపంవద్దకు తీసుకువచ్చారు. అనంతరం ఆలయం కమిటీ, పలువురు దాతలు సమకూర్చిన పుష్పాలతో వేదపండితులు, ఆలయ పూజారులు మహా పుష్పయాగం చేపట్టారు. ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, కొమ్మినేని వెంకటరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మహానివేదన, గోపూజ

సీఎస్‌పురం(పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన రుత్వికులు మంకాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

కనిగిరి రూరల్: మిచాంగ్ తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల ఎవరికి ఇబ్బంది కలిగిన స్పందించే విధంగా మున్సిపల్, సచివాలయ అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. తుఫాన్ ప్రభావం వల్ల ఎక్కువగా గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు తమ పిల్లలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, నీటి గుంటల వద్దకు, కరెంట్ స్తంభాల వద్దకు వెళ్ల కుండా జాగ్రత్తలు పాటించాలని, గృహిణులు తీగలపై దుస్తులు ఆరేసే టప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అర్హులందరికీ ఓటు హక్కు

పామూరు: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పిస్తామని తహసీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. మండలంలోని బీఎల్‌వో కేంద్రాల్లో శని, ఆదివారాల్లో చేపట్టిన ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పిస్తామన్నారు. తప్పుల సవరణలు చేయడంతో పాటు మరణించిన వారి ఓట్లను పూర్తి ఆధారాలు ఉంటేనే తొలగించాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ సూచించారు.

ఓటు హక్కు శిబిరాలు విజయవంతం


పాకల జెడ్పీ హైస్కూల్లో ఓటు శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉష

సింగరాయకొండ: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో సవరణలు, ఓటు నమోదు, తొలగింపునకు సంబంధించి శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులు జయప్రదం అయ్యాయని తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటు ప్రత్యేక క్యాంపును ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు నమోదుకు 15 అర్జీలు, ఓటు తొలగింపులకు 7 అర్జీలు, ఓటరు జాబితాలో సవరణలకు 35 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఆర్ఐ ప్రవీణ్, వీఆర్‌ఓ సీతారామయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

కనిగిరి రూరల్: మానసిక, శారీరక దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేఆర్ చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల వ్యవస్థాపకులు అంజిరెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్ బాబు, నవకుమార్ తదితరులు పాల్గొన్నారు.


వెలిగండ్ల నాయకులతో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఆదివారం వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువు, వెదుళ్లచెరువు పంచాయతీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంగా పనిచేసి ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ తేవాలన్నారు. వార్డు స్థాయిలో ఓటర్ల జాబితాలను నిశితంగా పరిశీలించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొందిన లబ్ధిని వివరించి, రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చైతన్యవంతులను చేయాలన్నారు. సంక్షేమ పథకాలతో కొనసాగాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలని వివరించాలన్నారు. ప్రతి బూత్‌లో మెజార్టీ వచ్చేలా పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణా, శ్రీధర్, సర్పంచ్‌లు బాలయ్య, జైపాల్, గుంటక నారాయణరెడ్డి, గుంటక వెంకటయ్య, జుటిక రావు, ఏసుబు, రమణయ్య, గుంటక వెంకటయ్య, బొప్పరాజు అంకయ్య, రవి, ఎస్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ సురేష్, కొలికి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

హనుమంతునిపాడు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వేములపాడు, లింగంగుంట్ల గ్రామాలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆదివారం వేములపాడు, లింగంగుంట్ల సచివాలయ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఎంపీడీఓ మాట్లాడుతూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిషాన్, ప్రధానమంత్రి అవాస్ యోజన, స్వచ్ఛభారత్ మిషన్, జలజీవన్ మిషన్, సాయిల్ హెల్త్ కార్డులు, కిషాన్ క్రిడిట్ కార్డులు, ఉజ్వల యోజన, స్కిల్ ఇండియా మిషన్, మిషన్ ఇంద్ర ధనుష్, పీఎం జన్‌ధన యోజన తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఏఓ క్రిష్ణారావు, ఏఈ శ్రీకాంత్ డాక్టర్ సందీప్, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సచివాలయ గృ హ సారథుల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, సర్పంచ్ పల్లపోలు రత్న, వ్యవసాయ శాఖాధికారి గోపిక్రిష్ణ, ఈఓఆర్డీ, షేక్ షరీఫ్, ఏఓ జీవీ క్రిష్ణారావు, శ్రీనివాసులరెడ్డి, మద్ది రత్తాలు, వైఎస్ ఎంపీపీ కొదమల బెంజి, వీఏఏలు శ్రీలక్ష్మి, ఏడుకొండలు, కార్యదర్శి కె.రాజు, ఆర్యవైశ్య నాయకులు చెక్కా రాము, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


వేములపాడు సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కె.లలిత

కనులపండువగా శాంతి కల్యాణం

పామూరు: పామూరు తూర్పువీధి కోదండరామ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో సీతా రామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో మొదట సీత, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహ, పంచలోహ విగ్రహమూర్తులకు అర్చకులు కురిమేటి సాయి పంచామృతాభిషేకం నిర్వహించి విశిష్ట పూజలు చేసి అనంతరం మహాగణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవమూర్తులకు మేళతాళాల నడుమ వేడుకగా ఎదురుకోల నిర్వహించి కల్యాణ వేదికపైకి చేర్చారు. అనంతరం రుత్వికుల వేదమంత్రాల నడుమ సీత, రామ ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం సాయంత్రం హనుమంత వాహనంపై గ్రామోత్సవం వైభవంగా సాగింది. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. యాటా రాఘవేంద్ర, ఇర్రి కోటిరెడ్డి, పుట్లూరి యోగీశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


కోదండరామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

6వ తేదీ వరకు సముద్ర స్నానాలు నిషేధం

సింగరాయకొండ: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఈ నెల 6వ తేదీ వరకు సింగరాయకొండ, టంగుటూరు మండలాల పరిధిలోని తీరప్రాంతాల్లో సముద్ర స్నానాలు నిషేధమని సీఐ దాచేపల్లి రంగనాథ్ ప్రకటించారు. తుఫాన్ ప్రభావంతో తీరంలో అలల ఉధృతి బాగా ఉంటుందని, అంతేగాకుండా తీరానికి సమీపం నుంచే తుఫాన్ వెళ్లే అవకాశం ఉన్నందున అల్లకల్లోలంగా ఉంటుందని తెలిపారు. అందువలన కార్తీక మాసం సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే భక్తుల భద్రత దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సముద్ర స్నానాలను నిషేధించామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. పాకల పల్లెపాలెంలో ఆయన మత్స్యకారులతో మాట్లాడి సలహాలు, సూచనలు చేశారు. జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావు, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.


పాకల బీచ్‌లో మత్స్యకారులతో మాట్లాడుతున్న సీఐ రంగనాథ్

పథకాలను సద్వినియోగం చేసుకోండి

జరుగుమల్లి: మండల పరిధిలోని వావిలేటిపాడు, జరుగుమల్లి సచివాలయాల పరిధిలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బెల్లం నిర్మల కోరారు. వావిలేటిపాడులో ఉజ్వల యోజన పథకం కింద ఆరుగురు మహిళలకు గ్యాస్ సిలిండర్లను ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.రామకృష్ణ పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, జరుగుమల్లి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బత్తిన మదన మనోహర్, సర్పంచి కసుకుర్తి పున్నారావు, వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, జరుగుమల్లి సచివాలయ కార్యదర్శి రామోహనరావు, వావిలేటిపాడు సచివాలయ కార్యదర్శి బ్రహ్మయ్య పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ